క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

పెంచికల్‌పేట్: మండలంలోని గుండ్లపేట్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హసీనా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రగతి పత్రాలు అందజేశారు. మహిళలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. పోషకాలు ఉన్న ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఆమె వెంట అంగన్‌వాడీ కార్యకర్త రాజమణి ఉన్నారు.

నిరుపేద కుటుంబానికి సరుకులు అందజేత

పెంచికల్‌పేట్: మండలంలోని ఆగర్‌గూడ గ్రామానికి చెందిన రాంటెంకి గణపతి కుటుంబానికి పెంచికల్‌పేట్ ఎస్సై విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న గణపతి కుటుంబానికి ఎల్లప్పుడు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఆయన వెంట సర్పంచ్ పాలె సుధాకర్, సిబ్బంది ఉన్నారు.

'కంటి వెలుగు' సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్‌రూరల్: కంటిపరీక్షలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని ఆడ పీహెచ్‌సీలో కంటివెలుగు కార్యక్రమం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అంధత్వ నిర్మూలనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమం తీసుకొచ్చిందన్నారు. ఎంపీపీ మల్లికార్జున్, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్, వైద్యులు సత్యనారాయణ, ఉన్నారు.

వాంకిడి: కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ ముండే విమలబాయి అన్నారు. బుధవారం సోనాపూర్ గ్రామంలో రెండో విడుత కంటి వెలుగు శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. సర్పంచ్ గంగుబాయి, ఉప సర్పంచ్ లచ్చు, పంచాయతీ కార్యదర్శి విలాస్, నాయకులు దీపక్ ముండే, వైద్య సిబ్బంది ఉన్నారు.

గ్రంథాలయంలో మౌలిక వసతులు కల్పించాలి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో మౌలిక వసతులు కల్పించాలని యువ నాయకులు ఆవిడపు ప్రణయ్ డిమాండ్ చేశారు. బుధవారం యువకులతో కలిసి గ్రంథాలయాన్ని సందర్శించారు. గ్రంథాలయంలో కేవలం 2 గదులు మాత్రమే ఉన్నాయని, సదుపాయాలు లేక పాఠకులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. నాయకులు నాగరాజు, గడ్డల ప్రణయ్, సాయి, ప్రశాంత్, కిరణ్, రాజశేఖర్, ఆకాష్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'ఓపెన్' పరీక్షలు

ఆసిఫాబాద్‌రూరల్: ఓపెన్ ఇంటర్, పది పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగినట్లు పరీక్షల నిర్వహణ అధికారి ఉదయ్‌బాబు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఓపెన్ పది పరీక్షలకు మొత్తం459 మంది అభ్యర్థులకు గాను 423 మంది హాజరు కాగా 36 మంది గైర్హాజరయ్యారన్నారు. ఇంటర్ పరీక్షలకు మొత్తం296 మందికి గాను 265 హాజరు కాగా 31 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

ప్రత్యేక పూజలు చేసిన మంచిర్యాల జడ్జి

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని ఈజ్‌గాం శివమల్లన్న దేవాలయంలో మంచిర్యాల జిల్లా జడ్జి సత్తయ్య బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో రుద్రాభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ రాజేశ్వర్‌రావు, పూజారి సంతోశ్ వర్మ పాల్గొన్నారు.

పర్సనల్ డిపార్టుమెంట్ సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్

రెబ్బెన: సింగరేణిలోని అన్ని ఏరియాల్లోని పర్సనల్ డిపార్టుమెంట్ అధికారులు, సిబ్బందితో బుధవారం డైరెక్టర్ (ఫైనాన్స్) బలరాం ఆధ్వర్యంలో జీఎం పర్సనల్ బసవయ్య, కుమార్ రెడ్డిలు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఏరియాలోని పర్సనల్ డిపార్టుమెంట్ అధికారులు సమావేశానికి హాజరయ్యారు. ఏరియా పర్సనల్ మేనేజర్ లక్ష్మణరావు, డీవైపీఎం తిరుపతి, సంక్షేమ అధికారులు వేణు, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఆదివాసీల సమస్యలపై ఆరా



ఆదివాసీలతో ఆర్‌డీ ట్రస్ట్ అధికారులు

కెరమెరి: ఆదివాసీలు పడుతున్న కష్టాలపై ఆంధ్రప్రదేశ్ అనంతపూర్‌నకు చెందిన రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ప్రతినిధులు బుధవారం మండలంలోని జోడేఘాట్, పాట్నాపూర్, శివగూడ గ్రామాలను సందర్శించారు. ఆయా గ్రామాల్లో సమస్యలు తెలుసుకున్నారు. భూపట్టాల పంపిణీ, తాగునీరు, ఇళ్లు లేకపోవడం వంటి సమస్యలను ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. త్వరలో ఉన్నతాధికారులకు సమస్యలపై నివేదిక సమర్పిస్తామని ఆర్‌డీ ట్రస్ట్ టీం డైరెక్టర్ నారాయణ అన్నారు. అధికారులు నాగరాజు, సుధాకర్, మల్లికార్జున్, ఆంజనేయులు, సిడాం ధర్ము ఉన్నారు.

కష్టం.. కన్నీటిపాలు!





ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు దోకె సత్తన్న, కర్జి గ్రామం. యాసంగిలో 2.5 ఎకరాల్లో వరి సాగు చేశాడు. వరి కోతకు వచ్చింది. మరో రెండు రోజుల్లో వరికోత ప్రారంభించాలనుకున్నాడు. కాని అకాల వర్షాల కారణంగా ఆగిపోయాడు. రెండు రోజుల క్రితం భారీ వడగండ్ల వర్షం కురవడంతో పొలంలో వరి గింజలన్నీ రాలిపోయాయి. చేతికొచ్చిన పంట నేలపాలైందని కన్నీరు పెడుతున్నాడు. కొన్ని నెలలుగా పడుతున్న తమ కష్టమంతా వృథాగా మారిందని ఆవేదన చెందుతున్నాడు. ఒక్క దోకె సత్తన్న మాత్రమే కాదు ఈసారి వరి సాగు చేసిన రైతులందరిదీ దాదాపు ఇదే పరిస్థితి.

- నేలకొరిగిన వరి పైరు
- వడగండ్ల వానకు రాలిన వడ్లు
- మండలంలో 6,300 ఎకరాల్లో సాగు
- 358 ఎకరాల్లో పంట నష్టం

దహెగాం: వానాకాలం కలిసి రాలేదు. యాసంగిలోనైనా కలిసి వస్తుందనుకుంటే కోతకు వచ్చిన వరి నేల వాలింది. దీంతో అన్నదాత బతుకు అగమ్యగోచరంగా మారింది. ఈసారి మండలంలో యాసంగిలో 6,300 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇప్పుడిప్పుడే కోతలు కూడా ప్రారంభమయ్యాయి.

అయితే వడగండ్ల వర్షాలు కురుస్తుండడంతో చేతికొచ్చిన వరి పంట నేలవాలిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

358 ఎకరాల్లో పంట నష్టం

వాతావరణం అనుకూలించకపోవడంతో సాగు చేస్తున్న సమయంలో వరికి అనేక రకాల తెగుళ్ల సోకాయి. తెగుళ్ల నివారణకు అనేక రకాల మందులు పిచికారీ చేశారు. కాని అకాల వర్షాల నుంచి పంటలను కాపాడుకోలేక పోతున్నామని రైతులు వాపోతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో అధిక వర్షాల వల్ల పెద్ద వాగు, ప్రాణహితలు ఉప్పొంగి వరద తాకిడికి పంటలన్నీ నీట మునిగాయి. ఖరీఫ్‌లో నష్టపోయామని, యాసంగిలో పంటలు పండించి అప్పుల బాధ నుంచి బయట పడదామనుకుంటే వర్షాల వల్ల నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు. అకాల వర్షాల వల్ల మండలంలో సుమారు 358 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని వ్యవసాయాధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు.

నేలవాలిన వరిపైరు..

అకాల వర్షాలకు చేతికొచ్చిన వరిపైరు నేలవాలింది. దీంతో కోత యంత్రాలకు అదనపు ఖర్చులు అవుతున్నాయని రైతులు వాపోతున్నారు. నేలవాలిన వరిపైరును కోసేందుకు అదనంగా ఎకరానికి రూ.2 వేలు ఖర్చవుతుందని పేర్కొంటున్నారు. కింద పడ్డ వరితో వడ్ల నాణ్యత తగ్గుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనేక చోట్ల గింజలన్నీ పొలంలో రాలిపోయాయని దీంతో కోయడానికి ఏమి మిగలలేదని వాపోతున్నారు.

మరో రెండు రోజులు వర్షాలు..

జిల్లాలో మరో రెండు రోజులపాటు ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ పేర్కొనడంతో రైతులు మరింత దిగాలు చెందుతున్నారు. ఇప్పటికే అకాల వర్షానికి 70శాతం పంటలు నష్టపోయామని, ఇంకా వర్షాలు కురిస్తే ఏమి మిగలదని ఆందోళన చెందుతున్నారు.

గింజలన్నీ రాలిపోయినయ్

యాసంగిలో రెండు ఎకరాల్లో వరి సాగు చేసినా. వరి పొట్టదశలో ఉన్నప్పుడు వడగండ్ల వాన పడ్డది. అప్పుడు కొంత నష్టపోయినం. రెండు రోజుల కిందట రాళ్లవాన పడడంతో కోతకు వచ్చిన వరికి నష్టం కలిగింది. కంకికి ఉన్న గింజలన్నీ రాళ్లవానకు రాలిపోయినయి.

– సందికట్ల రాజలింగు, రైతు, కర్జి


ప్రభుత్వం ఆదుకోవాలి

మా కష్టమంతా వానపాలైంది. రాళ్ల వాన పడడంతో కోతకు వచ్చిన వరి నేల రాలింది. గింజలన్నీ రాలిపోయినయి. ఎకరానికి రెండు క్వింటాళ్ల వడ్లు కూడా వచ్చేలా లేవు. వానలు రైతులను ముంచుతున్నాయి. సర్కారు ఆదుకోవాలి.

– తుమ్మిడె ఎల్లయ్య, రైతు, దహెగాం

నేలవాలిన ఆశలు

కౌటాల: మండలంలో మంగళవారం రాత్రి వడగండ్ల వాన బీభత్సం సృష్టించింది. దీంతో పార్డీ, సాండ్‌గాం, వీరవెల్లి గ్రామాల్లోని వరి పంట నేలవాలింది. గత కొద్ది రోజుల నుంచి కురుస్తున్న అకాల వర్షాలకు ఆయా గ్రామాల్లో 200 ఎకరాలకు పైగా చేతికొచ్చిన వరి పంట నేలవాలిందని రైతులు వాపోతున్నారు.



కౌటాల: వీరవెల్లిలో..

అన్నదాతకు అష్టకష్టాలు

చింతలమానెపల్లి: మండలంలో ఉల్లిగడ్డ, మొక్కజొన్న, వరి, కూరగాయలు చేతి కందే దశలో ఉండగా వడగండ్ల వాన కురవడంతో పంటలు నష్టం వాటిల్లింది. కాగా వర్షాలు తగ్గుముఖం పట్టడంతో మండలంలోని డబ్బా, అడెపల్లి, బారెగూడ గ్రామాల రైతులు తడిసిన పంటలను ఆరబెడుతూ కన్పించారు.



తడిసిన ఉల్లిగడ్డలు ఆరబెట్టిన రైతు



మొక్కజొన్న పంట ఆరబెట్టిన రైతు

చలివేంద్రం ఏర్పాటు

ఆసిఫాబాద్‌అర్బన్: ఎంఎంహెల్ప్‌లైన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావ్‌తో కలిసి ప్రారంభించారు. వేసవిలో ఎంఎంహెల్ప్‌లైన్ ఫౌండేషన్ చైర్మన్ ఎండీ అహ్మద్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, నిసార్, ఖలీల్, ఆరీఫ్, ఉబెద్ బిన్ యాహియా, తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ ఫోన్ రికవరీ చేసిన పోలీసులు



బాధితుడికి ఫోన్ అప్పగిస్తున్న ఎస్సై రమేశ్

సిర్పూర్(టి): మండలంలోని చింతకుంట గ్రామానికి చెందిన జరుపుల ప్రకాష్ కొన్ని రోజుల క్రితం సెల్‌ఫోన్ పోగొట్టుకోగా బుధవారం ఎస్సై రమేశ్ ఆధ్వర్యంలో పోలీసులు సెల్‌ఫోన్‌ను గుర్తించి బాధితుడికి అప్పగించారు. ఎస్సై మాట్లాడుతూ సెల్‌ఫోన్ పోగొట్టుకున్న బాధితులు తమ సెల్‌ఫోన్ల ఐఎంఈఐ నంబర్లతో ఫిర్యాదు చేస్తే గుర్తిస్తామన్నారు.

పంచాయతీ కార్యదర్శుల నిరసన

చింతలమానెపల్లి: మండలంలో పంచాయతీ కార్యదర్శులు ప్రభుత్వంపై తమ నిరసన కొనసాగిస్తున్నారు. బుధవారం అధికారిక వాట్సాప్ గ్రూపుల నుంచి వైదొలుగుతున్నట్లుగా జిల్లా, మండల అధికారులకు సమాచారం అందించారు. నాలుగేళ్లు గడుస్తున్నా రెగ్యులర్ చేయకపోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

కనక దుర్గాదేవి ఆలయంలో పూజలు

రెబ్బెన: ఇందిరానగర్‌లోని కనక దుర్గాదేవి, స్వయంభూ మహంకాళి ఆలయంలో బుధవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మే 2న ఆలయంలో నిర్వహించనున్న జాతరకు ముందే వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుంటున్నారు.

అంగన్‌వాడీ టీచర్లకు చీరల పంపిణీ

దేవార వినోద్ యువసేన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం ఆలయ ఆవరణలో అంగన్‌వాడీ టీచర్లకు చీరలు పంపిణీ చేశారు. మహంకాళి ఆలయంలో జరగబోయే జాతర గ్రామంలో జరిగే పెద్ద పండగతో సమానమని అంగన్‌వాడీ టీచర్లను ఇంటి ఆడబిడ్డలుగా భావించి ప్రతీ సంవత్సరం చీరలు పంపిణీ చేస్తున్నామని ట్రస్ట్ వ్యవస్థాపకుడు, ఆలయ ప్రధాన అర్చకుడు దేవార వినోద్ అన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

కౌటాల: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీమా పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కౌటాల టీజీబీ మేనేజర్ నరసింహస్వామి అన్నారు. బ్యాంకు ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని కన్నెపల్లి, గురుడుపేట గ్రామాల్లో ప్రజలకు బీమా పథకాలపై అవగాహన కల్పించారు.

విగ్రహావిష్కరణ విజయవంతం చేయాలి

కౌటాల: సిర్పూర్(టి) మండలంలోని హనుమాన్ నగర్‌లో ఈ నెల 30న ఆవిష్కరించనున్న శివాజీ మహరాజ్ విగ్రహావిష్కరణను ఆరె కులస్తులు పాల్గొని విజయవంతం చేయాలని ఆరె సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నారులే వానుపటేల్ అన్నారు. బుధవారం స్థానిక ఆరె సంఘం భవనంలో విగ్రహావిష్కరణ పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం సిర్పూర్(టి) మండల అధ్యక్షుడు శంకర్, నాయకులు మధుకర్, తుకారం, మల్లయ్య, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

పెంచికల్‌పేట్: మండలంలోని కొత్తగూడ గ్రామంలో బుధవారం శివాజీ మహరాజ్ విగ్రహావిష్కర పోస్టర్‌ను ఆరె సంక్షేమ సంఘం తాలుకా అధ్యక్షుడు చపిడే సత్యనారాయణ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సిర్పూర్(టి) మండల కేంద్రంలో ఈనెల 30న శివాజీ మహరాజ్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ చైర్మన్ హంసరాజ్ గంగారాం అహేరి హాజరు కానున్నట్లు తెలిపారు. ఆరెకుల బాంధవులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు డొకె మహేష్, శంకాపూర్ శంకర్, మోహన్, తోగన్న, లచ్చన్న, రామన్న, రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

మరో పోరాటానికి సిద్ధం కావాలి

కెరమెరి: ఆదివాసీల అస్తిత్వం కోసం మరో పోరాటానికి సిద్ధం కావాలని ఆదివాసీ సేనా సిర్పూర్(యూ) మండలాధ్యక్షుడు సోయం గుణవంత్ రావు అన్నారు. బుధవారం సిర్పూర్(యూ) మండలంలోని పాములవాడలో చలో గుడిహత్నూర్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. 11 కులాలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు చేసిన అసెంబ్లీ తీర్మానాన్ని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈనెల 29, 30ల లో గుడిహత్నూర్‌లో నిర్వహించే తెలంగాణ సేనా తృతీయమహాసభను విజయవంతం చేయాలని కోరారు. నాయకులు ఆత్రం దిన్‌కర్‌షా, తొడోసం ప్రభు, గోవింద్‌రావు, సీతారాం, భీంరావు, బారిక్ రావు, మానిక్‌రావు, నాగోరావు ఉన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

వర్మీ కంపోస్టు తయారు చేయాలి

కెరమెరి: సెగ్రిగేషన్ షెడ్లలో వర్మీ కంపోస్టులు తయారు చేయాలని ఎంపీవో సుదర్శన్, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య అన్నారు. బుధవారం మండలంలోని కరంజీవాడ, బోరిలాల్‌గూడ, అంతాపూర్, జోడేఘాట్, బాబేఝరి గ్రామాల్లో కొనసాగుతున్న గ్రామపంచాయతీ పనులను పరిశీలించారు. శ్మశాన వాటికల్లో విద్యుత్ సౌకర్యం, నీటి సదుపాయం కల్పించాలన్నారు. నర్సరీల్లో మొక్కలను వంద శాతం బతికించాలని, చనిపోయిన మొక్కల స్థానాల్లో ఇతర మొక్కలు నాటాలన్నారు.



నర్సరీని పరిశీలిస్తున్న ఏపీవో మల్లయ్య

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి



అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

నార్నూర్(ఆసిఫాబాద్): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. జైనూర్ మండలం కొండిబగూడ గ్రామంలో బుధవారం నిర్వహించిన అంబేద్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అంబేద్కర్ కల్పించిన రిజర్వేషన్లతోనే నేడు పదవులు అనుభవిస్తున్నామన్నారు. ప్రతిఒక్కరూ తమ పిల్లలను చదివించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలన్నారు. కార్యక్రమంలో గుణాజీ పాల్గొన్నారు.

బొజ్జిరావును ఆదర్శంగా తీసుకోవాలి

తిర్యాణి: గుండాల గ్రామంలో నూతన వ్యవసాయ పద్ధతులతో సాగు చేపట్టిన సోయం బొజ్జిరావును ఆదివాసీలు ఆదర్శంగా తీసుకోవాలని ఆదివాసీ సేన జిల్లా అధ్యక్షుడు కోట్నాక గణపతి అన్నారు. బొజ్జిరావు 28వ వర్ధంతి సందర్భంగా గ్రామంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గణపతి మాట్లాడుతూ గుండాల గ్రామంలో రాతినేలలపై పంటలు పండించడం కోసం ఆయన చేసిన సంస్కరణలు మరువలేనివన్నారు. సర్పంచ్ కోట్నాక జంగుబాయి, మాజీ ఎంపీటీసీ కోవ మోతీరాం పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే బహిరంగ క్షమాపణ చెప్పాలి'

కాగజ్‌నగర్‌రూరల్: భక్తుల మనోభావాలు దెబ్బతీసిన ఎమ్మెల్యే కోనేరు కోనప్ప బహిరంగ క్షమాపణ చెప్పాలని బీజేపీ నాయకుడు పాల్వాయి హరీష్‌బాబు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని ఈజ్‌గాం శివమల్లన్న దేవాలయాన్ని సందర్శించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. మంగళవారం బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారని, వచ్చిన నాయకులు, కార్యకర్తలకు మాంసాహార విందు వడ్డించారన్నారు. ఈజ్‌గాం దేవాలయానికి ఎంతో చరిత్ర ఉందని, ఇప్పటివరకు ఆలయ ప్రాంగణంలో మాంసహార విందు జరగలేదని పేర్కొన్నారు. కొత్త సంప్రదాయానికి తెరలేపి ఆలయ పవిత్రతను కాలరాసారని పేర్కొన్నారు. అనంతరం హరిద్వార్ నుంచి తీసుకొచ్చిన గంగాజలంతో ఆలయాన్ని శుద్ధి చేశారు. బీజేపీ నాయకులు కొంగ సత్యనారాయణ, కాళిదాస్ ముజుందార్, గోలెం వెంకటేశ్, బికాస్ ఘరామి, అమిత్‌బిశ్వాస్, దీపక్, ప్రసాద్, తిరుపతి, అశోక్, శేఖర్, సుమన్ పాల్గొన్నారు.

స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలి

ఆసిఫాబాద్: స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అన్నారు. హైదరాబాద్ నుంచి బుధవారం సంయుక్త ఎన్నికల అధికారి రవికిరణ్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్నిజిల్లాల కలెక్టర్లతో ఎఫ్‌ఎల్‌సీపీఈఈటీ తొలగింపు, ఓటరు గుర్తింపు కార్డుల జారీపై సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ అసెంబ్లీ నియోజకవర్గాలకు రిటర్నింగ్ అధికారులను నియమించేందుకు నిర్దేశించిన ప్రొఫార్మాలో ప్రతిపాదనలను రూపొందించి అందజేయాలన్నారు. జూన్‌లో రాజకీయ పార్టీలకు ముందస్తు సమాచారం అందించి, వారి సమక్షంలో వీడియో రికార్డింగ్‌తో ఈవీఎం, వీవీప్యాట్ల ఎఫ్‌ఎల్‌సీ పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణ కోసం ఉద్యోగులు, సిబ్బందికి శిక్షణ అందించేందుకు శిక్షకుల నియామక ప్రతిపాదనలు అందించాలని సూచించారు. ఎన్నికల వ్యవస్థపై అనుమానాలు సృష్టించే విధంగా సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారాలు తిప్పికొట్టేలా జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలో సోషల్ మీడియా బృందాలను నియమించాలన్నారు. కలెక్టర్ హేమంత్ బోర్కడే, అదనపు కలెక్టర్ రాజేశం, డీఆర్వో రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

రెవెన్యూ అధికారులతో సమావేశం

అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లతో కలెక్టర్ హేమంత్ బోర్కడే సమావేశమయ్యారు. జాబితాలోని డబుల్ ఓట్లను తొలగించాలన్నారు. మీసేవ కేంద్రాలను తనిఖీ చేయాలని, ధరణిలో వచ్చిన దరఖాస్తులు, రికార్డులు పరిశీలించి పరిష్కరించాలన్నారు.

కుష్ఠు వ్యాధిగ్రస్తులను పరిశీలించిన రాష్ట్ర బృందం

సిర్పూర్(టి): మండలంలోని లోనవెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కుష్ఠు వ్యాధిగ్రస్తులను బుధవారం రాష్ట్ర లెప్రసీ టీం సభ్యులు పరిశీలించి వివరాలు సేకరించారు. 19 మంది వ్యాధిగ్రస్తులను గుర్తించి వైద్యచికిత్సలపై అవగాహన కల్పించారు. అనంతరం వారికి మందులు పంపిణీ చేశారు. లెప్రసీ టీం అధికారులు వెంకటేశ్వర చారి, శ్రీనివాస్, జోసెఫ్, డీపీహెచ్‌వో రమేష్, వైద్యురాలు కృష్ణవేణి, వైద్యసిబ్బంది సునీత, పద్మావతి పాల్గొన్నారు.



లోనవెల్లి పీహెచ్‌సీ వైద్యసిబ్బందితో రాష్ట్ర లెప్రసీ టీం సభ్యులు